క్లుప్తంగా

ఎమ్మెల్సీ పరామర్శ



నాగేశ్వరరావును పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ సురేష్‌బాబు

నెల్లిమర్ల: స్థానిక పట్టణంలో వైఎస్సార్ సీపీ నాయకుడు వాళ్లె నాగేశ్వరరావు కుటుంబాన్ని ఎమ్మెల్సీ సురేష్‌బాబు శనివారం పరామర్శించారు. ఇటీవల భీమిలిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నాగేశ్వరరావు కుమారుడు మరణించగా, విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ బాధిత కుటుంబాన్ని కలిసి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. జరిగిన దుర్ఘటనపై విచారం వ్యక్తం చేశారు. పార్టీపరంగా అండగా ఉంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నేత దవళ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ బెంచీల ఏర్పాటు



ఎంఈవో కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సిమెంట్ బెంచీ

డెంకాడ: మండల కేంద్రంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు, వేంకటేశ్వరస్వామి ఆలయం, వైఎస్సార్ విగ్రహం వద్ద, దొడ్డిబాడువ గ్రామ బస్‌స్టాప్ వద్ద డెంకాడ పీఏసీఎస్ మాజీ చైర్మన్ రొంగలి కనకసింహాచలం తన సొంత నిధులతో సిమెంట్ బెంచీలు శనివారం ఏర్పాటు చేశారు. ఆయన భార్య రొంగలి సత్యవతి జ్ఞాపకార్థం వీటిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ సేవలు, బస్సుల కోసం వేచి చూసే వారికి, పాదచారులు సేదతీరేందుకు ఇవి ఎంతగానో ఉపయోగపడతాయని, సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరారు.

అప్రమత్తంగా ఉండాలి



క్లోరోస్కోప్‌లు అందజేస్తున్న డీపీవో శ్రీధర్‌రాజా, ఎంపీడీవో రాధిక

పూసపాటిరేగ: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు సీజనల్ వ్యాధుల బారినపడకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, పారిశుధ్య చర్యలను ముమ్మరం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రాజా సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో శనివారం సమావేశమైన ఆయన.. ఓడీఎఫ్ ప్లస్ సర్వేను పారదర్శకంగా చేయాలని, బోరుబావులు, రక్షిత మంచినీటి పథకాల్లో క్లోరినేషన్ చర్యలు చేపట్టాలని, ఎక్కడా మురుగునీటి నిల్వలు లేకుండా చూడాలని తెలిపారు. అనంతరం కొత్తగా కొనుగోలు చేసిన 28 క్లోరోస్కోప్‌లను పంచాయతీ కార్యదర్శులకు అందచేశారు. ఎంపీడీవో ఎం.రాధిక, ఈవోపీఆర్‌డీ శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రవీణ్‌శంకర్ పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



సీతారాముల కల్యాణం చేస్తున్న అర్చకులు

విజయనగరం: నగరంలో ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటకేంద్రమైన రామనారాయణంలో సీతారాముల కల్యాణం శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని, ఉదయం ఆలయ అర్చకులు చాణక్య, శ్రీహర్ష, తేజల ఆధ్వర్యంలో వేదమంత్రాల నడుమ పంచామృతాభిషేకాలు చేసి, అనంతరం కనుల పండువగా స్వామి వారి కల్యాణం జరిగింది. కార్యక్రమంలో ఎన్‌సీఎస్ ట్రస్ట్ సభ్యులు నారాయణం శ్రీనివాస్, నీరజవల్లి దంపతులు, నారాయణం సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

మూఢనమ్మకాలను విడనాడాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ భాస్కరరావు

గుర్ల: ప్రజలు మూఢ నమ్మకాలను విడనాడాలని ఎస్‌ఐ భాస్కరరావు సూచించారు. మండలంలోని దమరసింగి గ్రామస్తులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులు, పెద్దలు ఎవరికైనా ఆరోగ్యసమస్యలు తలెత్తితే చికిత్స కోసం ఆస్పత్రికి తరలించాలని సూచించారు. సకాలంలో వైద్యం అందించకుండా నాటువైద్యులను, దాసుళ్లను ఆశ్రయించి కాలయాపన చేస్తే వారి ప్రమాదాలకే ముప్పు అని అన్నారు. చిల్లంగి, చేతబడి వంటి మూఢనమ్మకాలను నమ్మవద్దని సూచించారు. ఏఎస్‌ఐ కామేశ్వరరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బడిలో.. ఎన్నికల బరి!

- పాఠశాలల్లో ఎస్‌ఎంసీ ఎన్నికలకు నగారా
- ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిన అధికారులు
- ఈ నెల 8న ఎన్నికలు

నియోజకవర్గంలో మొత్తం పాఠశాలల సంఖ్య:	123
ఉన్నత పాఠశాలల సంఖ్య:	16
ప్రాథమికోన్నత పాఠశాలల సంఖ్య:	9
ప్రాథమిక పాఠశాలల సంఖ్య:	98
ఆయా పాఠశాలల్లో చదువుతున్న మొత్తం విద్యార్థుల సంఖ్య:	15,724



నగరంలోని మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాల

విజయనగరం: ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్‌ఎంసీ(స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ) ఎన్నికలకు నగారా మోగింది. జిల్లా విద్యాశాఖ ఆదేశాల మేరకు ఇప్పటికే ఎన్నికల నిర్వహణకు సంబంధించి, ప్రధానోపాధ్యాయులు ఎన్నికల ప్రకటన విడుదల చేశారు. ఓటర్ల జాబితాలను నోటీస్‌బోర్డులో కూడా ప్రదర్శించారు. ఇదివరకున్న పేరెంట్స్ కమిటీల స్థానంలో ఎస్‌ఎంసీలను తీసుకురాగా, గతంలోని పేరెంట్స్ కమిటీల పదవీకాలం 2023 సెప్టెంబరు 21వ తేదీతో ముగిసింది. ఇంకా పాత కమిటీలే కొనసాగుతుండడంతో ప్రస్తుతం అధికారంలోని కూటమి ప్రభుత్వం ఎస్‌ఎంసీ ఎన్నికల నిర్వహణకు నిర్ణయించింది. ఈ ఎన్నికల్లో కూడా తమకు అనుకూలమైన వారిని నియమించుకునేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఈ ఎన్నికలలో రాజకీయ జోక్యం ఉండడానికి వీల్లేదని ఎన్నికల షెడ్యూల్ స్పష్టం చేసింది. మరోవైపు విద్యాశాఖ, సమగ్ర శిక్షా అధికారులు ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

ఒక్కో తరగతి నుంచి ముగ్గురు..

ఆయా పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఓటర్లుగా ఉంటారు. వారు మాత్రమే అక్కడ పోటీ చేయాల్సి ఉంటుంది. ప్రతీ తరగతి నుంచి ముగ్గురు సభ్యులను ముందుగా ఎన్నుకుంటారు. ప్రాథమిక పాఠశాలల్లో 15 మంది, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 21 మంది, ఉన్నత పాఠశాలల్లో 15 మంది చొప్పున సభ్యులతో కమిటీని ఏర్పాటు చేస్తారు. అనంతరం వారంతా కలిసి చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నుకుంటారు. వీరితో పాటు ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఆరుగురిని నియమిస్తారు.

షెడ్యూల్ ఇలా...

- ఈ నెల 5వ తేదీన ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్య తుది ఓటర్ల జాబితా ప్రకటిస్తారు.
- 8వ తేదీన ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కమిటీ సభ్యుల ఎన్నిక ఉంటుంది.
- ప్రతీ తరగతిలో విద్యార్థుల తల్లిదండ్రులను ముగ్గురు చొప్పున ఎన్నుకోవాల్సి ఉంటుంది.
- ఇలా ఎన్నికైన 15 మంది సభ్యుల నుంచి అదేరోజు మధ్యాహ్నం 1.30 గంటల నుంచి చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నుకుంటారు. వీరిలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ప్రాధాన్యం ఉంటుంది.
- మధ్యాహ్నం 2 గంటలకు ప్రమాణ స్వీకారం, 3.30 గంటల్లోపు తొలి సమావేశం నిర్వహిస్తారు.

మార్గదర్శకాలివీ..

- ఎన్నిక జరిపేందుకు కనీసం 50 శాతం మంది తల్లిదండ్రులు హాజరుకావాలి.
- తల్లిదండ్రుల్లో ఒకరు మాత్రమే ఓటు వేసేందుకు అర్హులు.
- వివిధ తరగతుల్లో పిల్లలుంటే ప్రతీ తరగతిలో జరిగే ఎన్నికలో పాల్గొనవచ్చు.
- చేయి పైకి ఎత్తడం, నోటితో చెప్పడం ద్వారా ఈ ఎన్నిక జరుగుతుంది.
- ప్రభుత్వం జారీ చేసిన గుర్తింపుకార్డులను ఓటర్లు తీసుకురావాలి.

సర్వం సిద్ధం చేశాం..

పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలకు సర్వం సిద్ధం చేశాం. మండల స్థాయిలో తహసీల్దార్, ఎంపీడీవోలు, పాఠశాల పరిధిలోని రెవెన్యూ, పంచాయతీ కార్యదర్శులు ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షిస్తారు. అంతా సజావుగా జరిగేలా చర్యలు చేపడుతున్నాం. –ఆనందమూర్తి, మండల విద్యాశాఖ అధికారి, విజయనగరం.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న నగరపాలక సంస్థ కమిషనర్ మల్లయ్యనాయుడు

- నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు

విజయనగరం: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని, ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని నగర పాలక సంస్థ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు సూచించారు. నగరంలోని బొండాడ, చిన్న వీధులతో పాటు ఉసిరికల సత్రం జంక్షన్ తదితర ప్రాంతాల్లో ఆయన శనివారం పర్యటించి, అక్కడి పారిశుధ్య పరిస్థితులను పరిశీలించారు. అనంతరం స్థానికులకు పలు సూచనలు చేశారు. మనచుట్టూ ఉన్న పరిసరాల్లో పేరుకుపోయిన అపరిశుభ్రత కారణంగానే దోమలు, ఈగలు విపరీతంగా పెరిగి మలేరియా, డెంగీ, టైఫాయిడ్, డయేరియా వంటి విషజ్వరాలు వ్యాప్తి చెందుతాయన్నారు. వర్షాకాలం నేపథ్యంలో నీరు నిల్వ ఉండే అవకాశం ఎక్కువగా ఉంటుందని, దీంతో దోమలు విపరీతంగా పెరిగే అవకాశం ఉంటుందన్నారు. దోమల బారినపడి జ్వరాలు రాకుండా ఉండాలంటే మన ఇంటి ముందు, ఇళ్ల పరిసరాల్లో ఎటువంటి నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. కొన్ని ఇళ్లకు వెళ్లి, వారి ఇళ్ల ముందు ఉన్న నీటి నిల్వలను తొలగించారు. ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రతకు పాటుపడాలని అప్పుడే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బవిరెడ్డి సతీష్, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పిచ్చిమొక్కలు తొలగించండి..

విజయనగరం: నగరంలోని గంటస్తంభం ప్రాంతంలో ఉన్న ప్రధాన కాలువలో శనివారం చేపట్టిన పూడికతీత పనులను నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు పరిశీలించారు. ప్రధాన రోడ్ల డివైడర్ల వద్ద పెరిగిన పిచ్చిమొక్కలను కూడా తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. నగరంలో నెలరోజులుగా పారిశుద్ధ్య చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రజారోగ్యమే లక్ష్యంగా అన్ని కాలువల్లోని పూడికలు, చెత్తాచెదారం తొలగిస్తున్నామన్నారు. ప్రజలు కూడా వ్యర్థాలను డస్ట్‌బిన్‌లో వేయాలని, కాలువల్లో పడేయవద్దన్నారు.

రక్తదానాన్ని సామాజిక బాధ్యతగా గుర్తించాలి



రక్తదాతను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ ఆనందబాబు

విజయనగరం ఫోర్ట్: రక్తదానాన్ని సామాజిక బాధ్యతగా అందరూ గుర్తించి, రక్తదానానికి ముందుకు రావాలని పోలీస్ శిక్షణ కళాశాల ప్రిన్సిపాల్ టి.ఆనందబాబు కోరారు. స్థానిక గాయత్రి ఆస్పత్రిలో శనివారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి, కాసేపు మాట్లాడారు. రక్తదాతలే ప్రాణదాతలని, ఆరోగ్యవంతులైన ప్రతిఒక్కరూ ఏడాదికి నాలుగుసార్లు రక్తం దానం చేయవచ్చన్నారు. రక్తదాన శిబిరాలు నిర్వహించడం ద్వారా రక్తం కొరత తీర్చవచ్చన్నారు. ప్రాణాపాయంతో కొట్టుమిట్టాడుతున్న వ్యక్తికి ప్రాణం పోసేందుకు మన రక్తం ఉపయోగపడుతుందన్న విషయాన్ని ప్రతిఒక్కరూ మానవతాదృక్పథంతో చూడాలన్నారు. అనంతరం రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందజేసి, సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు, ఆస్పత్రి ఎం.డి. వెంకట్, రెడ్‌క్రాస్ ప్రతినిధులు రాము, గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

భారీ అన్నసమారాధన



అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

విజయనగరం టౌన్: మాసశివరాత్రి పురస్కరించుకుని, నగరంలోని కంటోన్మెంట్ గూడ్స్‌షెడ్ వద్ద ఉన్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ ఆవరణలో భారీ అన్నసమారాధన కార్యక్రమం శనివారం చేపట్టారు. ఆలయ కమిటీ చైర్మన్ రెయ్యి శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని, అన్నప్రసాదం స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహాశివునికి ప్రీతికరమైన మాసశివరాత్రి రోజున భక్తులకు అన్నదానం చేయడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రమణమ్మ, మారమ్మ, శోభారాణి, భీమరాజు, భరణి, సోమశేఖర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



ప్రమాణ స్వీకారం చేస్తున్న కొత్త కార్యవర్గ సభ్యులు

నెల్లిమర్ల: ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నెల్లిమర్ల యూనిట్ నూతన కార్యవర్గం ఎన్నిక స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జరిగింది. సంఘ జిల్లా జాయింట్ సెక్రటరీ, నెల్లిమర్ల తాలూకా ఇన్‌చార్జి లెంక సత్తిబాబు ఎన్నికల పరిశీలకులుగా, సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వరరావు ఎన్నికల అధికారిగా వ్యవహరించి, ఎన్నికలు సజావుగా నిర్వహించారు. ఈ ఎన్నికలో సంఘ అధ్యక్షుడిగా పి.వీరన్నదొర, కార్యదర్శిగా టి.శివప్రసాద్, సహాధ్యక్షుడిగా జి.చక్రవర్తి, కోశాధికారిగా ఎం.మురళీమోహన్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా టి.వెంకటరావు, ఉపాధ్యక్షులుగా కె.విజయలక్ష్మి, బి.ఉమ, జి.పద్మగౌరి, జె.వేణుబాబు, జె.వి.లీ, సంయుక్త కార్యదర్శులుగా బి.ఎ.వెంకటేశ్వరరావు, సభ్యులుగా కె.శ్యామ్‌కుమార్‌యాదవ్, సౌజన్య, జి.కృష్ణవేణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరందరితో జిల్లా అధ్యక్షుడు కంది వెంకటరమణ ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో సీహెచ్ వెంకటసతీష్, తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో జీవితాలు నాశనం



అవగాహన కల్పిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి ప్రేమలత

చీపురుపల్లి: మాదకద్రవ్యాలతో జీవితాలు నాశనమవుతాయని, ఎట్టి పరిస్థితుల్లో వాటి జోలికి వెళ్లవద్దని స్థానిక కోర్టు జూనియర్ సివిల్ జడ్జి వై.ప్రేమలత సూచించారు. మాదకద్రవ్యాలతో కలిగే అనర్థాలు, నిరోధంపై ఏపీ స్టేట్ లీగల్‌సెల్ అథారిటీ ఆదేశాల మేరకు పట్టణంలోని ఎస్.వి.ఆర్ డిగ్రీ కళాశాలలో శనివారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం, రవాణా నేరమనేని స్పష్టం చేసారు. మాదకద్రవ్యాలతో పట్టుబడిన తర్వాత అందులో ఏముందో తనకు తెలియదని చెప్పినా ఎలాంటి ఫలితం ఉండదన్నారు. గంజాయి వంటి మాదకద్రవ్యాలతో దొరికితే కిలో లోపు అయితే సంవత్సరం జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా ఉంటుందని, అదే కిలోదాటి పట్టుబడితే పదేళ్ల జైలుశిక్షతో పాటు రూ.2 లక్షల జరిమానా విధిస్తారని వివరించా రు. అలాగే గంజాయి వ్యాపారం ద్వారా సంపాదించిన ఆస్తులను గుర్తిస్తే ప్రభుత్వం స్వాధీనం చేసుకునే చట్టాలు కూడా ఉన్నా యన్నారు. మాదకద్రవ్యాలు దాచుకునేందుకు స్థలం ఇచ్చినా, గంజాయి పండించేందుకు భూములు లీజుకు ఇచ్చినా నేరం పరిధిలోకి వస్తుందని స్పష్టం చేసారు. విద్యార్థులు చదువుపై శ్రద్ధ పెట్టి ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలన్నారు. ఎస్‌ఐ కె.కిరణ్‌కుమార్ నాయుడు, న్యాయవాదులు ఆర్.నాగభూషణపట్నాయక్, జగదీష్, కె.త్రినాథ్, రఘుపతినాయుడు, కిరణ్, కళాశాల కరస్పాండెంట్ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

వయనాడ్ వరద బాధితులను ఆదుకోవాలి



విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వై.వెంకటేశ్వరరావు

విజయనగరం పూల్‌బాగ్: కేరళలోని వయనాడ్ వరద బాధితులను ఆదుకోవాలని, అక్కడ జరిగిన విపత్తును జాతీయ విపత్తుగా ప్రకటించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వై.వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. నగరంలోని తోటపాలెం, ఆర్‌టీసీ కాంప్లెక్స్ ప్రాంతాల్లో సీపీఎం ఆధ్వర్యంలో వరద బాధితుల సహాయార్థం విరాళాల సేకరణ శనివారం చేపట్టారు. మనవంతు బాధ్యతగా బాధితులను ఆదుకోవాలని కోరారు. ఇప్పటివరకు ఆ విపత్తు కారణంగా 300 మంది చనిపోయారని, జాతీయ పరిశోధన సంస్థ ఊహకు కూడా అందని విధంగా నష్టం జరిగిందన్నారు. ఆ రాష్ట్రంలోని అధికారంలో ఉన్న వామపక్ష ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి, బాధితులను అన్ని విధాలా ఆదుకునేందుకు ప్రయత్నిస్తోందన్నారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వాలు కూడా తమవంతు సహాయం చేస్తున్నాయన్నారు. మన రాష్ట్ర ప్రభుత్వం నుంచి కూడా సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు, ఎ.జగన్మోహన్‌రావు, కె.సురేష్, సీహెచ్ వెంకటేష్, డి.రాము తదితరులు పాల్గొన్నారు.

నల్లఇసుక దందాపై ఆరా



చేపలకంచేరు సముద్ర తీరాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ సురేష్, సీఐ రవికుమార్

భోగాపురం: మండలంలోని ముక్కాం, చేపలకంచేరు సముద్ర తీర ప్రాంతాల్లో జరుగుతున్న నల్లఇసుక దందాపై తహసీల్దార్ సురేష్, సీఐ రవికుమార్ స్థానికులను ఆరాతీశారు. ఈ నెల ఒకటో తేదీన సాక్షి దినపత్రికలో నల్ల ఇసుక దందా పేరుతో ప్రచురితమైన కథనానికి సదరు అధికారులు స్పందించారు. శనివారం ఆయా ప్రాంతాలకు వెళ్లి, అక్కడి పరిస్థితులను సమీక్షించారు. అక్రమార్కులు ఇక్కడి ఇసుక తరలించకుండా ప్రత్యేక టాస్క్‌ఫోర్స్, మెరైన్ సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నామని వారు తెలిపారు.

సాక్షి ఎఫెక్ట్

పిచ్చిమొక్కల తొలగింపు



జంగిల్స్ తొలగించిన తర్వాత పాఠశాలకు వెళ్లే దారి ఇలా..

భోగాపురం: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలకు వెళ్లే మార్గంలో ఇరువైపులా గుబురుగా పెరిగిన ముళ్లపొదలు, పిచ్చిమొక్కలను శనివారం తొలగించారు. ఈ నెల ఒకటో తేదీన సాక్షి దినపత్రికలో భయం.. భయంగా పాఠశాలకు విద్యార్థులు అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించిన విద్యాశాఖ అధికారులు పాఠశాలకు వెళ్లే దారిలో నెలకొన్న జంగిల్స్‌ను తొలగించే పనులు చేపట్టారు. దీంతో విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేష్టం



విజయనగరం ఫోర్ట్: ర్యాలీలో అంగన్‌వాడీ కార్యకర్తలు

పూసపాటిరేగ: తల్లిపాలే బిడ్డకు శ్రేష్టమని, పుట్టిన పిల్లలకు ఆరు నెలల పాటు తల్లిపాలే ఇవ్వాలని భోగాపురం ఐసీడీఎస్ పీవో ఎస్తేరురాణి తెలిపారు. మండలంలోని సీహెచ్ అగ్రహారం, గోవిందపురం గ్రామాల అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. శనివారం ఈ కార్యక్రమంలో భాగంగా ఆమె బిడ్డకు తల్లిపాల ఆవశ్యకతను వివరించారు. పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు తల్లిపాలు చాలా అవసరమన్నారు. ప్రతీ తల్లి తన బిడ్డకు పాలివ్వడం బాధ్యతగా తీసుకోవాలన్నారు. తల్లిపాలు బిడ్డకు సంపూర్ణ పౌష్టికాహారమని, తల్లిపాలు శిశువుకు ఇవ్వడం ద్వారా తల్లుల్లో బ్రెస్ట్ కేన్సర్ వచ్చే ప్రమాదం తగ్గడంతో పాటు చిన్నారుల్లో రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు కొత్తకోట శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం ఫోర్ట్: తల్లిపాల వారోత్సవాలు సందర్భంగా నగరంలోని బొత్సపేట అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన ర్యాలీ శనివారం నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ బి.అనూరాధ మాట్లాడుతూ అప్పుడే పుట్టిన శిశువుకు కొన్ని నెలల వరకు తల్లిపాలే ఇవ్వాలని సూచించారు. తల్లిపాల ద్వారా శిశువుకు సంపూర్ణ ఆరోగ్యం, రోగనిరోధక శక్తి వస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం కృష్ణవేణి, అంగన్‌వాడీ కార్యకర్త శ్యామలాదేవి తదితరులు పాల్గొన్నారు.



పూసపాటిరేగ: తల్లిపాల ఆవశ్యకతను వివరిస్తున్న ఐసీడీఎస్ పీవో ఎస్తేరురాణి